# తప్పు

హావీస్

జీవితాన్ని చూసి ఆశ్చర్యపోయే వయసు కాదు రామనాథానిది.

ఐనా అతను ఆశ్చర్యపోతున్నాడు. ఇరవయ్యయిదోఏట అమ్మా నాన్నా తనని వొదిలి పరలోకానికి పోయినప్పుడు అతను ఆశ్చర్య పోయాడు చుట్టూ చూసుకుని, తననీ, తనలాంటి మరోయిద్దర్నీ కని, పెంచి తనకు రెక్కలిచ్చి, ఏనాడూ జిర్రున చీదేపాటి అనారోగ్యం కూడా లేకుండా, అందరిచేతా మంచి అనిపించుకుని. పైగా నిత్యయౌవ్వనులవలె ఉల్లాసపు బిరుదుకూడా పొందిన ఆ పుణ్య దంపతులు ఒక్కరోజు తేడాలో తమని విడిచిపెట్టి పెళ్ళిపోతే యిది యింతేనా, యింతకన్నా ముగింపు మరోరకంగా చెయ్యడా భగవంతుడు అని ఆశ్చర్య పోయాడు. చెల్లెళ్ళిద్దరూ గోడుగోడున ఏడుస్తూంటే తనకంటినుంచి వొక్క చుక్కైనా రాలకపోవటం గమనించి ఆశ్చర్యపోయాడు. తన కళ్ళెదుట గుప్పెడు బూడిదౌతుంటే తన గుండెల్ని ఏదో పిండేస్తున్నట్టుంటే ఆశ్చర్య పోయాడు. ఆ కాసిని రోజులూ గడిచాక బైటపడిసాగిన సంగతులుచూసి ఆశ్చర్య పోయాడు. తనతండ్రీ తల్లీ పెద్దయింటినే మిగిల్చారు తనకి — దాన్ని మింగే అప్పుల్తో.

రామనాథం తనకు తెలీకుండానే ఆరోజునుంచీ మారిపోయాడు. అప్పులు తీర్చవలసిన అగత్యం తనకేమీ లేనట్టుగా ప్రవర్తించాడు. దావాలువేస్తే వాళ్ళని మూడు కోర్టులు తిప్పించాడు. చివరికి యిల్లుకాస్తా వేలమైన రోజున అతనిపేర రహస్యంగా ఎనిమిదివేలు పోగైంది.

రామనాథం చేసింది న్యాయమైన పని కాదు. రూపాయిలకి అర్ధరూపాయల వంతునైనా అప్పులవాళ్ళకి చెందలేదు. వాళ్ళు తన తండ్రినీ, తననీ తిట్టినతిట్లూ,

శాపనార్థాలూ అత నేమీ పట్టించుకో లేదు. 'మొండివాడు రాజుకన్నా బల వంతుడు' అన్నారు. ఆ మాట అతను పూర్తిగా విశ్వసించా డన్న సంగతి ఎవరూ ఊహించలేదు.

రహస్యంగా మిగిలిన ఎనిమిది వేలతో ఊరు విడిచాడు రామనాథం. తమ పరగణాకి దూరంగా వొకచోట అంత బస్తీ అంత పల్లె కాని ఊళ్ళో చిన్నదుకాణం తెరిచాడు. అందులో బట్టలనించి ఆముదం దాకా అన్ని రకాలూ దొరుకుతాయి. రెక్కలమీద బతికే వాళ్ళకి అతని కొట్లో వస్తువులు ప్రీతిపాత్రా లైనాయి. రామనాథం అప్పు లిచ్చాడు.

ఐదు సంవత్సరాల్లో యిద్దరు చెల్లెళ్ళ పెళ్ళి చేసి, తనపెళ్ళి చేసుకున్నాడు. పెద్దబజారులో మాంచి షాపు తెరిచాడు.

రామనాథం తననుగురించి యితరులు ఏమేమి అనుకుంటున్నారో తెలుసుకుంటూనే వొచ్చాడు. నిజానికి అదతనికి వో వ్యాధిలాంటిది. తనను ఎవరన్నా పొగిడితే ఆ పొగడ్త నమ్మలేకపోయే వాడు. తనను ఎగతాళి పట్టించటానికో లేక ఉబ్బెయ్యటానికో ఆ పని చేస్తున్నారని మనసారా నమ్మేవాడు. తన బలహీనతలు, తన లోపాలు తనకే తెలుసును. తనను ఎందుకు పొగడాలి ఎవరైనా? ఎవరైనా తిడితే అది పట్టించుకునేవాడు కాదు. మరీ కోపం వస్తే ఆ మనిషితో కొన్నాళ్ళపాటు మాట్లాడడం మానేసేవాడు.

అందుచేతకూడా రామనాథానికి చాలా చెడ్డపేరు వొచ్చింది. అతను పొగరుమోతన్నారు కొందరు; కాదు 'సినిక్' అన్నారు కొందరు. చాలాసార్లు రామనాథంకూడా తనను గురించి అలాగే అనుకున్నాడు. అవతలవాళ్ళ మంచితనంలో తనకి నమ్మకం లేకపోవటం క్షమించరాని అపరాధం అని తనను తాను తిట్టుకున్నాడు. మనసా వాచా కర్మణా మంచివాళ్ళని తాను ఎందర్ని చూడలేదు? ఆమాట కొస్తే తాను పుట్టిన యింట్లో దుర్మార్గు లెవరూ లేరు. ఇతరులను ప్రేమించటమూ, ఆదరించటమూ మాత్రమే తెలిసినవాళ్ళు తన తల్లిదండ్రులు. మరి తానెందు కలా తయారౌతున్నాడు? తాను ఎవరివల్లా మోసపోలేదు. మోసపోతాడేమో నన్న భయం మాత్రం ఉంది తనకు. ఆ భయమే తననలా తయారు చేస్తుందేమో? కాని అందువల్ల తనకి అపకారం జరగనంత కాలం తన పద్ధతి మార్చుకోనవసరంలేదు.

రామనాథానికి తను చదువుకునే రోజుల్లో జరిగిన సంఘట నొకటి గుర్తు కొచ్చింది. తన జూనియర్‌గా ఉన్న రాజేంద్రతో తనకి తమాషాగా పరిచయం ఐంది. రాజేంద్ర బాగా ఉన్న కుటుంబంలో పుట్టినవాడు. చాలా నీట్‌గా, దర్జాగా ఉండేవాడు. పరుషంగా వొక్క

మాటైనా ఆదెరకం కాదు. స్నేహితుల కోసం ఎంతైనా ఖర్చుపెట్టేవాడు. ఇంటికి పోతే సంబరాలు పడుతూ ఆదరించే వాడు. ఇన్నింటికితోడు శ్రద్ధగా చదివే వాడుకూడాను. మనిషి అందగాడుకూడా. అతన్ని మిత్రుడుమూర్తి పరిచయం చేశాడు. ఆతనికి తనకిమల్లేనే బొమ్మల పిచ్చి ఉండేది. తను ఏవో పత్రికల్లో గీసినబొమ్మలు చూసి వాటిని మెచ్చు కుంటే. మూర్తి తీసుకొచ్చి పరిచయం చేశాడు. మొదట్నించీ ఎక్కువమంది స్నేహితులు కావాలన్న మనసు కాదు తనది. ఐనా అతన్ని మనస్ఫూర్తిగా తన స్నేహితుడ్ని చేసుకున్నాడు. సొంత సోదరుడిలా భావించాడు. అతనితో పరి చయ మైన తర్వాత అతన్ని గురించి మరికొన్ని సంగతులు తెలిశాయి. ఒక నాడు అతని ప్రసక్తి రాగా మూర్తిరూమ్ మేట్ రాజారావు "అంతా డాబుసరిలే గురూ" అన్నాడు. తను కొంత ఆశ్చర్య పోయినమాట నిజం. వాళ్ళిద్దరూ అతనికి ప్రాణస్నేహితు లని తన నమ్మకం. "అంటే ?" అన్నాడు, "పెద్ద స్పోర్ట్స్ మన్‌లాగా పోజు. గట్టిగా బాట్ పుచ్చు కోవటమన్నారాదు"అన్నాడు రాజారావు.

''నేర్చుకుంటున్నాడేమో ?''

''సు ప్వేమన్నా అను భాయ్ ! అంత 'షో' నాకు నచ్చదు" అన్నాడు మూర్తి.

అంటే

"అదే, ఆటరాకపోయినా ఆ బూట్లూ, స్వెట్టర్లూ వేసుకోవటం స్టైలు కొట్టడం లాంటివి."

రాజేంద్రమీద వాళ్ళకి అంత 'తేలిక అభిప్రాయం కలగటానికి కారణం తనకి అర్థం కాలేదు, అతను ఉన్నవాడు, గనక ఆ అలంకారాలు చేసుకుంటాడు. అతనికి టెన్నిస్ రాకపోవటం నిజమే కావచ్చును గాక. కాని ఐస్‌క్రీమ్ కోసమూ, బిస్కట్లకోసమూ అతనింటికి వెళ్తా మను కునే మిత్రు లాడవలసిన మాటలేనా అవి? వాళ్ళ యింట్లో అలవాట్లని గురించికూడా వాళ్ళ ఎద్దేవ చేస్తుండేవాళ్ళు. అది చాలా ఘోరం అనిపించేది తనకి.

ఇలా ఉండగా వొకరోజున మూర్తి వొచ్చి" రాజేంద్ర పెళ్ళి చేసుకోబోతు న్నాడు తెలుసునా ?" అన్నాడు. అందులో అంత విశేషం ఏమీ కనిపించలేదు తనకి.

"అలాగా ?" అన్నాడు.

"వర్ణాంతర వివాహం.''

తనకి నవ్వొచ్చింది "ఈ కోతల కేంలే" అన్నాడు.

"ప్రమాణపూర్తిగా నిజం. అప్పా రావుగా రమ్మాయి సుమతి.''

అది జరిగేది కాదనిపించింది తనకి. అప్పారావుగారు ఉన్నవాడు కాకపోయినా శ్రోత్రియుడు. ఈ పెళ్ళికి స సే మి రా వొప్పుకోడు. పైగా ఈ 'వన్ వే' ప్రేమ కలాపాలమీద అంత విలువ ఉంచటమూ మంచిది కాదు

యువ

"కాదు భాయీ! రాజేంద్ర ఏమైనా సరే, ఆ అమ్మాయినే చేసుకుంటా నంటున్నాడు. ఆ అమ్మాయి అప్పుడప్పుడు వాళ్ళింటికి వొస్తూంటుంది. రాజేంద్ర తమ్ముడు ఆ అమ్మాయిని వొదినా అని పిలవటం నాచెవుల్తో విన్నాను" అన్నాడు. మూర్తి.

"రాజేంద్ర తల్లిదండ్రుడు లొప్పుకున్నారంటావా?"

"మహారాజులాగా. వాళ్ళ కేం నష్టం. నష్టవంటూ ఉంటే అది అప్పారావు గారికి."

"నిభాయించుకో గలడంటావా యితను?"

"ఆమాట అనకులే. అతని కేం తక్కువ? పిల్లల్ని ఫారిన్ కూడా పంపుకో గలడు. ఐనా రోజులు మారటంలేదూ?"

రాజేంద్ర నిజంగానే యింత గ్రంథమూ నడుపుతూన్నట్టైతే అది మంచిది కాదని హితవు చెప్పా లనిపించింది తనకి. ఎదురీత పనులు చెయ్యడంలో గొప్పేమీ లేదు. దాన్ని నిభాయించుకోవటంలోనే ఉంది. రాజేంద్ర చాలా మంచివాడు. రాబోయే పరిణామాల్ని ఎదుర్కొనే ధైర్యం ఉన్నా అతని మంచితనం అతనికి చెయ్యగల హాని ఎంతైనా ఉంది.

"నిరుత్సాహ పరుస్తావా?" అన్నాడు రాజారావు ఆశ్చర్యంగా.

"అదే మంచి దనిపిస్తోంది" అన్నాడు తను.

"పిచ్చివెషా లెయ్యకు. అతను మనకు కావలసినవాడు. అతని సుఖం కోరటం మనవిధి. ఆ అమ్మాయిని తప్ప మరొకర్తెను నసేమీ చేసుకో నంటున్నాడు అతను. చేతనైతే వాళ్ళిద్దరికీ పెళ్ళి జరిపించే విధానం చూడు. అంతేగాని..."

మిత్రు లిద్దరూ ఎంత చెప్పినా తన మనసు మార్చుకోలేక పోయాడు తను. భవిష్యత్తులో రాబోయే మార్పుల్ని నమ్ముకుని వర్తమానాన్ని చక్కబెట్టుకోవటం జూదమాడటం. సుమతిమీద అతనికి గాఢమైన అపేక్ష ఉండి ఉండవచ్చు. కాని దాన్ని తెంచుకోవటం ఆ అమ్మాయికీ యితనికీకూడా క్షేమకరం. తన అభిప్రాయం వివరించి వాళ్ళ మనసు మార్చలేడా?

వారం పది రోజుల తర్వాత అందుకు అవకాశం చిక్కింది. ఆరోజు సాయంత్రం తాను బందరుపురానికి ప్రసిద్ధి తెచ్చిన మాచవరం చవిటిపర్రలపైకి వాహ్యాళి వెళ్ళినవేళ రాజేంద్ర, సుమతి అక్కడ కనిపించారు. ఆ అమ్మాయిని దగ్గరగా చూడటం అదే మొదటిసారి. అందమైన అమ్మాయే. రాజేంద్రకి చక్కని జోడీ. ఆమెను చూడగానే తనకి చటుక్కున తన రెండోచెల్లెలు ఉమ గుర్తు కొచ్చింది.

"రండి రండి" అన్నాడు తనని చూడగానే రాజేంద్ర.

తను పోయి కూచున్నాడు.



రెండు నిముషాలు పిచ్చాపాటి ఐనాక "మాసంగతి తెలిసిందా?" అన్నాడు రాజేంద్ర మెల్లగా.

"తెలిసింది'' అన్నాడు తను.

ఆ అమ్మాయి సిగ్గుతో తల వంచేసుకున్నది.

అతనికి హితవు చెబుదా మని అనుకున్నాడేగాని, అది ఎలా చెప్పాలో ఆ క్షణాన అర్థం కాలేదు. పడుచుదనపు ఆవేశానికీ, అనుభవానికీ తేడా అదేనేమో? చివరికి గొంతు పెగుల్చుకుని "నువ్వు మనసు కష్టపెట్టుకోనంటే ఒక సంగతి చెబుతాను రాజేంద్రా" అన్నాడు తను.

"చెప్పండి'' అన్నాడు రాజేంద్ర.

"మీరిద్దరూ నాకు కావలసినవారు. ఆ అమ్మాయి నీ స్నేహితురాలు గనక నాకూ ఆప్తురాలె. చెల్లిలాంటిదని భావించి యిది చెబుతున్నాను. ఈ పెళ్ళిమూలాన మీ రిద్దరూ సుఖపడరని పిస్తోంది. మీ నాన్నగారూ, అమ్మగారూ ఒప్పుకున్నా అప్పారావుగారు ఒప్పుకుంటా రని తోచదు. ఇక మీదనైనా ఆ అభిప్రాయం మార్చుకోండి. మీ రిద్దరూ

సుఖపడాలన్న ఉద్దేశంతో యిది చెబు తున్నాను."

రాజేంద్ర ముఖం వివర్ణమైంది. ఆ అమ్మాయి ముఖం పక్కకి తిప్పేసు కున్నది.

"అభిప్రాయం మార్చుకోవటం చెప్పి నంత తేలిక కాని మాట నిజమే. కాని అంత్యనిష్ఠూరంకన్నా ఆదినిష్ఠూరం మేలు గదా? వొకరి మీద వొకరికి ప్రేమ ఉంటే పెళ్ళే చేసుకోనవసరం లేదు. స్నేహితులుగానే ఉండవచ్చు. డబ్బూ హోదాలతో మనం కొనుక్కోలేనివి చాలా ఉన్నాయి. అవి లేనప్పుడు గాని ఆ వెలితి తెలీదు. ఆలోచించుకోండి."

"క్షమించండి! చేతోగీసిన బొమ్మని చెరిపినంత సులభం కాదిది."

రాజేంద్ర కంఠంలో బాధా, పట్టుదలా కూడా ధ్వనించటంతో నిట్టూర్చి వూరు కున్నాడు తను. మరోసారి ఆలోచించాక యిందులో అంతబాధ పడవలసిందేమీ లేదేమో ననిపించింది. అతనా బాగా ఉన్నవాడు. డబ్బుతో కొండమీది కోతి నైనా దింపుకు రావచ్చు. 'డబ్బు'కి మనిషి యిచ్చే విలువ రోజురోజుకీ పెరుగు తోంది, కొన్నాళ్ళు పోయాక...

చివరికి రాజేంద్ర సుమతిని పెళ్ళి చేసుకున్నాడు. ఆ పెళ్ళి రాజారావూ, మూర్తి చెప్పిన పరిస్థితుల్లో మాత్రం జరగలేదు. రాజేంద్ర తండ్రి ఆ అమ్మాయిని చేసుకుంటే గడప తొక్క డానికి వీల్లేదని శాసించాడు. ఆస్తిలో చిల్లిగవ్వ యివ్వనన్నాడు. రాజేంద్ర ఏదో వూరుపోయి అక్కడ సుమతిని పెళ్ళి చేసుకున్నాడు.

"మీ కీ పెళ్ళి యిష్టమేగా? వాళ్ళ నాన్నని వొప్పించలేక పోయారా?" అన్నాడు తను.

"అనవసరంగా జోక్యం చేసుకుని నీలాగా మాట పోగొట్టుకో మంటావా?"

నిజమే. తనంటే తెలివితక్కువవాడు. తనకి నవ్వొచ్చింది. మరొకళ్ళ వ్యవహా రాల్లో జోక్యం కలిగించుకో కూడదన్న సిద్ధాంతం ఎంతవరకు? ఎవడన్నా సంతో షంగా ఉంటేనో ఏదైనా మంచి పని చేస్తేనో వాడ్ని మనం అభినందించ వచ్చునట. తప్పుచేస్తే ఖండించకూడదుట. జీవిత సూత్రాలు యింత పెళుసువీ, అర్ధ రహిత మైనవీనా?...

రామనాధానికి అదంతా గుర్తుకు వొచ్చి మనసంతా ఏదోలా ఐపోయింది. పరిస్థితులు అప్పటికీ యిప్పటికీ వొక రకంగా ఉన్నాయి. ఆరోజుల్లో ఏదన్నా పెద్ద లాభం ఉంటే తప్ప మనుషులు మరొకర్ని మోసగించేవాళ్ళు కాదు. ఈనాడు ఎంత చిన్న విషయానికైనా తమనీ, యితరుల్నీ కూడా మోసగి స్తున్నారు. అది లోకవ్యవహార సరళి ఐంది. ధైర్యం పోయింది.

రామనాధానికి తన కుటుంబం సంగతి గుర్తు కొచ్చింది. పెద్దవాడు రాంబాబు,

యింజనీరింగ్ చదువుతున్నాడు. ఈ ఏటితో అది పూర్తవుతుంది. రెండో వాడు వ్యాపారం మీద మోజు పడుతున్నాడు. ఆ డిగ్రీ కాస్తా తీసుకుని రేపో మాపో తన బరువు తీరుస్తాడు. అమ్మాయి పెళ్ళైంది. తనకి ఏ చీకూ చింతాలేదు.

ఆలోచనలు తెగిపోవటంతో రామనాథం తన చుట్టూ చూశాడు. కనుచీకటి పడుతోంది. పబ్లిక్‌గార్డెన్సు కోలాహలంగానే ఉన్నాయి. తనకి కొద్దిదూరంలో నిలబడి తనవంకే చూస్తున్న వ్యక్తిని పరకాయించి చూసి 'ఎవరో' అనుకున్నాడాయన. రెండు క్షణాలైనాక "అరె! రాజారావు! నువ్వా?" అన్నాడు. ఆయన కూడా వొచ్చి చతికిలపడి "ఇవాళ ఏదో విశేషమేనే" అన్నాడు.

"విశేషమే మరి, ఊరుకాని ఊళ్ళో తమ దర్శనం కావటం" అన్నాడు నవ్వి రామనాథం.

"అంతకన్నా విశేషం నీబోటి వాడు పార్కుకి రావటం."

"అది నిజమే ననుకో! ఇది సొంత ఊరుకాదుగా? ... ఏవిటి విశేషాలు? ఎందు కొచ్చావీవూరు?"

"మావాడు ఉస్మానియాలో ఎమ్మే చదువు తున్నాడు. చూసిపోదా మని వొచ్చాను. నువ్వు?"

"మా అమ్మాయిని అత్తవారింటో దిగవిడవటాని కొచ్చా."

"మీ వాడి యింజనీరింగ్ ఈ ఏటితో ఐపోతుందిగదూ?"

"ఆఁ."

"సంబంధాలు చూస్తున్నావా?

"అంతా వాడికే వొదిలేశాను."

"జాగ్రత్త! ఏ కులం తక్కువ దాన్నో చేసుకుంటాడేమో?"

"మన కులా లన్నీ సమంగా ఉన్నా యంటావా?"

"బతకనేర్చిన వాడివి."

"అది అందరూ నేర్చుకోవాలి. నేర్చుకోక పోవటం నేరం కూడానేమో!... ఏమైనా నా కలాంటి దిగులులేదు."

"ఖాయ మైపోయిందా?"

"లేదు. వాణ్ని నమ్మగలను."

నవ్వాడు రాజారావు.

"ఔను గానీ ... రాజేంద్ర ఎక్కడున్నాడో తెలుసా?"

"ఈ ఊళ్ళోనే ఉన్నాడు."

"ఇక్కడా?"

"బడిచౌడి పోలీస్ స్టేషన్ పక్క సందులో. ఏదో కోపరేటివ్ సొసైటీలో ఎకౌంటెంటుగా పనిచేస్తున్నాట్ట."

"మనిషి బావున్నాడా? పిల్లలా?"

"ఆ ముగ్గురు ఆడపిల్లలు, పెద్దదీ. రెండోదీ పెళ్ళికి సిద్ధంగా ఉన్నారట. మనిషి బాగా చిక్కిపోయి ఉన్నాడు."

"చూసి యిరవై ఏళ్ళవుతుందేమో?.. దురదృష్టవంతుడు."

"ఏవిటో బ్రదర్ ! మనకి బతకటం చేతగాదేమో ననిపిస్తుంది. ఏ వయసుకి తగ్గ ఆలోచనలు ఆ వయసుకి రాక పోవటం ఒక జబ్బు మనలో. పైగా ఆంధ్రపౌరుషం."

"అత నేవన్నా సంబంధాలు చూస్తున్నాడా ?"

"చూస్తూనే ఉన్నాడు; చేసుకునేందుకు ఎవరూ ముందుకు రావటం లేదుగాని."

"ఇంత సిటీలో కూడా కులా లున్నాయా ?" అన్నాడు రామనాథం ఆశ్చర్యంగా.

"సిటీలో ఉండేదికూడా మామూలు మనుషులేగా ?"

"పిల్లలకి చదువు చెప్పించాడా ?"

ఎస్సెల్సీ దాకా చెప్పించాట్ట. ఆ పైన స్తోమత లేక మానేశాడు."

"తమ్ము దేమీ సహాయం రాలేదూ ?"

"సర్లే! ఆయనగారు అత్తవారి చేతిలో కీలుబొమ్మ. ఆస్తిమీద పెళ్లానిదే అజమాయిషీ."

"అత నేంచేస్తున్నాడు ?"

"బందర్లోనే ఏదో వ్యాపారం చేస్తున్నాడు."

"ఐతే ఆ పిల్లల పెళ్ళిళ్ళు కష్టమే."

"ఆ...వొస్తా బ్రదర్ ! చీకటిపడి పోయింది" అని లేచి వెళ్ళిపోయాడు రాజారావు.

మరి కాస్తసేపు కూచుని లేచి యింటికి బైల్దేరాడు రామనాథం. రాజేంద్ర సంగతే ఆయన మనసులో వొలవసాగింది. ఆ రోజున తన మాట వినిఉంటే అతనికి కష్టాలు వొచ్చిఉండేవి కావేమో ? రాజా రావు అన్న మాట కూడా నిజమే. ఏ వయసులో రావల్సిన ఆలోచనలు ఆ వయసులో రావటంలేదు.

ఆ రాత్రంతా కూడా అదే ఆలోచనతో గడిచింది రామనాథానికి. రాజేంద్రకు ఎలాగైనా సహాయం జరగాలి. అది ఎలా జరగాలో, ఏం చెయ్యాలో ఆయనకి అర్థం కాలేదు. బాగా కట్నం యిస్తానంటే అతని కూతుళ్ళకి మంచి సంబంధాలు రాకపోవు. 'బాగా' అంటే పదివేలకి తక్కువ కాకుండా అని. అంత మంచి సంబంధం తెచ్చాక అది నిలబెట్టుకోవటాని కెంత కావాలి ? అమ్మాయి అత్తవారింటికి పోవడంతో బాధ్యత తీరి పోతుందా? పురుళ్ళు, పుణ్యాలు, పండుగ పబ్బాలు—ఎన్ని ఉన్నాయి ? ఎక్కడ లోటు జరిగినా కథ మొదటికే వొస్తుంది. అందరూ సంకుచిత మనస్కులే ఉండరు. కాని అవతల వాడి మనసులో దూరి చూడటం ఎలా సాధ్యం ? జూదంలా ఐపోతున్నాయి పెళ్ళిళ్ళు.

మర్నాడు ఉదయం రాంబాబుని వెంటబెట్టుకొని రాజేంద్ర యిల్లు వెతుక్కుంటూ బైల్దేరాడు రామనాథం. తండ్రి వెంట తానూ ఎందుకో రాంబాబుకి అర్థం కాకపోయినా, ఆయన యందుండే గౌరవంచేత మాట్లాడకుండా అనుసరించా



''ఇదుగో ! గుడ్డ ఉతకటానికి సబ్బు లేదు, దొరికితే వదిలిపెట్టకండి.''

డతను. అరగంటసేపు కాళ్ళు అరిగేలా తిరగ్గా రాజేంద్ర నివాసం దొరికింది. పెద్దసైజు 'జనతాహౌస్' అది. డజను కాపురాలకు పైగా ఉన్నాయి. అందులో రాజేంద్ర భాగం రెండు గదులు. ముందు గదిలో ఎవరో పదహారు పద్దెనిమిదేళ్ళ అమ్మాయి కూచుని ఏదో అల్లుకుంటోంది. ఆగంతకుల్ని చూడగానే చివాల్న లేచి నిలవబడింది.

"రాజేంద్ర ఉన్నాడామ్మా?" అన్నాడు రామనాథం.

"నాన్నగారిప్పుడే బైటికి వెళ్ళారండీ. ఇప్పుడే వొస్తారు. కూచోండి" అన్నాదామె చాప వాలుస్తూ.

రామనాథంగారు కూచుని కొడుకుని కూచోమని "నువ్వు రాజేంద్ర పెద్ద కూతురువా ?" అన్నాడు.

"ఔనండీ."

"నీ పేరు."

"మాలతి"

"ఎందాకా చదువుకున్నావు ?"

"ఎస్సెస్సెల్సీ పాసైనాను"

రామనాథం గది నలువైపులా చూశాడు. గదినిండా సామాన్లు లేకపోయినా బోసిగా మాత్రం లేదు. ఉన్న నాలుగు వొస్తువులూ పొందికగా అమర్చి ఉన్నాయి. చటుక్కున 'ఆనాటి' రాజేంద్ర గది గుర్తొచ్చింది ఆయనకి. 'ఆ గది'లో రోజ్‌వుడ్ టేబి లుండేది. దానిమీద ధవళ కాంతితో మెరిసిపోయే దంతపు రాధాకృష్ణుల బొమ్మ వుండేది. తలుపులకి ఖరీదైన కర్టెన్సు వేలాడుతూండేవి. అవేమీ యిక్కడ లేవు, రామనాథం ఎవరూ చూడకుండా పైపంచెతో కళ్లొత్తుకున్నాడు.

ము అమ్మగా రంట్లో లేరా ?"
అన్నాడు చివరికి.

"పూజ చేసుకుంటున్నారు. పిలవమంటారా ?"

రామనాధం ఊ అనబోయే టంతలో గుమ్మంలోంచి వొకాయన లోపలికి వొచ్చాడు. పొడుగ్గా డీలాగా ఉన్నాడు. చేతిలో సంచి ఉంది. రామనాధాన్ని చూడగానే వొక్క క్షణం తత్తరపడి "అరె! మీరా ?" అన్నాడు.

రాజేంద్ర! ఎంత మారిపోయాడు ?

రాజేంద్ర చేతిసంచి అక్కడ పడేసి సంభ్రమంతో రామనాధం పక్కన వొచ్చి కూలబడ్డాడు. ఆవేశంతో ఎన్నో ప్రశ్న లడిగేశాడు. చివరికి "ఇన్నాళ్ళకి నేను మీకు కనిపించా నన్నమాట ?'' అన్నాడు డగ్గుత్తికతో.

"అవేం మాటలు రాజేంద్రా ?'' అన్నాడు రామనాధం కదిలిపోయి.

"ఉత్తరాలుకూడా రాయటం మానేశారు. మీ రెక్కడున్నారో తెలుసుకోవటానికి అప్పట్లో మీరు బొమ్మలు గీసిన పత్రికలవాళ్ళకికూడా ఉత్తరాలు రాశాను. వాళ్లూ జవాబులు రాయలేదు. వాళ్ళకి మీకు మల్లేనే నామీద కోపం వొచ్చిందేమో ననుకున్నాను" అన్నాడు, ఏభై సంవత్సరాలు రాబోతున్న రాజేంద్ర!

"నన్ను అంతగా అర్థం చేసుకున్నా వన్నమాట ?"

"తప్పేనేమో ? కాని నాకు మీ ముగ్గుర్లో ఎవరూ అర్థం కాలేదు. రాజారావూ, మూర్తీ అప్పుడప్పుడుకనిపిస్తూనే ఉంటారు. వాళ్ళు మీ సంగతి చెప్పేవారు కాదు. తెలియదనేవారు."

"ఇంకొకళ్ళు చెప్పే అబద్ధాలకి నేనా బాధ్యుడ్ని ?"

రాజేంద్ర తెల్లబోయి, వోక్షణానికి తెప్పరిలి "పోన్లెండిగాని విశేషాలు చెప్పండి...ఎవ రితను ?" అన్నాడు.

"మా పెద్దబ్బాయి"

రాజేంద్ర ఆశ్చర్యంగా "నిజంగా ?" అని "ఏం చదువుతున్నావోయ్ ?" అన్నాడు.

"బి. యి. ఫైనల్ యియర్ చదువుతున్నానండి" అన్నాడు రాంబాబు.

"అదృష్టవంతులు రామనాధం గారూ !" అన్నాడు రాజేంద్ర.

"నువ్వుమాత్రం కాదూ ?...అంత చక్కటిపిల్ల ఎన్ని నోములునో స్తేకలుగుతుంది ?" అన్నాడు రాజారావు.

"ఆడపిల్ల కలగడం అదృష్టమే నంటారా ?"

"అలాంటిమాట యింకెప్పుడూ అనకు! నీకు బాధకలిగితే నీలోనే ఉంచుకోవాలి రాజేంద్రా! యితరుల్ని కూడా బాధపెట్టి ఏం ప్రయోజనం ? అందులో ఆడపిల్ల మనసు కష్టపెట్టటం చాలా ఘోరం"

"క్షమించండి"

కొన్ని క్షణాలు మౌనంగా గడిచాయి. మాలతి రెండు కప్పుల్తో కాఫీ తెచ్చి అక్కడ పెట్టింది. అది తాగుతూండగా సుమతి గుమ్మంలోకివొచ్చి "కులాసాగా ఉన్నారా అన్నయ్యగారూ ?" అన్నది.

"కులాసాగానే ఉన్నానమ్మా !... నిన్న పబ్లిక్ గార్డెన్సులో రాజారావు కనిపించి చెప్పాడు, మీ రిక్కడ ఉన్నారని...నువ్వేమిటి అలా ఐపోయావు ?" అన్నాడు రామనాథం.

"ఆయన అర్ధాంగిని కదూ ;"

"మంచిపోలిక !... మీ పుట్టింటి కబు ర్లేమయినా తెలుస్తున్నాయా ?"

"నిన్న రాజారావుగారే చెప్పారు. నాన్నగారికి పక్షవాతంట; మంచంలో ఉన్నా రని.''

'హరి హరీ' అనుకున్నాడు రామనాథం. ఆమె గుండెకోత ఎవ రర్ధం చేసుకుంటారు ?

"అయ్యో" అన్నాడు పైకి.

సుమతి కళ్ళు వొత్తుకుంది చెంగుతో.

"నీతో వోమాట చెప్పిపోదా మని వొచ్చానోయ్ రాజేంద్రా" అన్నాడు రామనాథం రెండు క్షణా లాగి.

"చెప్పండి"

"మీ పెద్దమ్మాయి పెళ్ళివిషయం.

"చెప్పండి'' అన్నాడు రాజేంద్ర.

"నీ యిష్టమైతేనే అనుకో!...నా ఎరికలో వొక సంబంధం ఉంది. కాస్తో కూస్తో ఉన్నవాళ్ళు. కుర్రవాడు చదువు కుంటున్నాడు, నలుగుర్లోనూ బొనసిపించు కుంటున్న కుటుంబమే. అడగమంటే అడుగుతాను."

''ఎందుకులెండి ?...మీకు...''

"అదేం ఫర్వాలేదు. వాళ్ళు అలాంటి పట్టింపు లున్నవాళ్ళు కాదు. పెద్దగా కట్నాలుకూడా అడగరు''

''కొంతమాత్రం ఎక్కడినుంచి తెస్తాం ?" అన్నది సుమతి.

"అసలడగరమ్మా !' పెళ్ళి చెయ్యగలిగితేచాలు"

"మా సంగతి తెలిశాక ఏవంటారో?.. అంత్యనిష్టూరంకన్నా ఆదినిష్టూరం మేలన్నారు" అన్నది సుమతి.

రామనాథానికి ఎవరో ఛెళ్ళన కొట్టినట్టైంది. నిజమే. సుమతికి ఆ బాధ ఉండటంకూడా సహజమే. మనుషుల్లో నమ్మకాలు కలగటానికి చాలాపరిస్థితులు దోహదం చేస్తాయి. భౌతిక జీవితానికీ ఏదో అలౌకిక శక్తికీ ముడిపెట్టే అలవాటు ఈ గడ్డమీద పుట్టిన ప్రతిమనిషికీ ఉంది అందులో ఎంత చెడో, ఎంత మంచో ఎవరూ నిర్ణయించలేరు. అలాంటి నమ్మకా లుండటం మనిషి బలహీన తనేవారూ లేకపోలేదు. ఎంత బలమైన వాడైనా ఆ నమ్మకాలతోనే ఉంటాడు. ఆ నమ్మకాల పర్యవసానం బాధ ఐనా సరే!

"ఆబాధ అక్కర్లేదమ్మా ?"అన్నాడు రామనాథం చివరికి.

"ఇదంతా జరిగేదంటారా ?" అన్నదామె.

"జరుగుతుందనే నా నమ్మకం"

"సరే...మీ ఇష్టం, ఆయన నిష్టం"

"ఏమంటావు రాజేంద్రా ?" అన్నాడు రామనాధం.

"మీ యిష్టం...మీరు చెప్పినట్టుగా జరిగితే నాకు చాలా మేలు చేసినవారౌతారు"

"పెళ్లిల్లో పప్పన్నం పెట్టించు, చాలు!"

"అది యివాళే చెయ్యండి."

"అలాకాదు. మాలతి పెళ్ళికూతురైనాకే ఈ యింట భోజనం చేస్తాను."

"తప్పించుకోవటానికి మంచిఎత్తు" అన్నది సుమతి నవ్వుతూ.

"అదేదో జంతువు వెనక్కి నడుస్తుందట. మొహం వెనక్కి తిప్పినంత మాత్రాన దూరం వెనకౌతుందా ? అన్నాడు రామనాధం.

మరికొంచెం సేపు మాట్లాడి కొడుకుతో సహా బైటికి వొచ్చాడు రామనాధం. రాజేంద్ర అప్పటికీ యిప్పటికీ ఏమీ మారలేదు. అదే అమాయకత్వం, నిష్కల్మషత్వం. సుమతి మాత్రం ఆనాటి సంఘటన యింకా మర్చిపోలేదు. అది సహజమే !

"వాళ్ళు చాలా పేదవాళ్ళా నాన్నగారూ ?" అన్నాడు రాంబాబు కొంత దూరం నడిచాక.

"ఊఁ"

"ఎవరైనా పేదవాడికే యివ్వొచ్చుగా పిల్లల్ని ?"

"అంత తేలిగ్గాదు రాంబాబూ !... వాళ్ళ యిద్దరి కులాలూ వొకటి కావు. తెలుసా ?"

"అలాగా ?"

"అందుకే ఈ బాధ... ఇంతకీ ఆ అమ్మాయి చాలా బావుందికదూ ?"

"ఏమో" అన్నాడు రాంబాబు నవ్వి.

"చూశావుగా ?"

"ఊఁ"

"మైనారిటీ తీరిన కొడుకు తండ్రికి స్నేహితుడితో సమాన మన్నారు. అదే దృష్టితో అడుగుతున్నాను. ఆ అమ్మాయి ఎలా ఉంది ?"


"అందంగానే ఉంది ?" అన్నాడు రాంబాబు నవ్వుతూ.

"అలాంటి అమ్మాయిని నీకు చూపిస్తే చేసుకుంటావా ;"

"ఆఁ"

రామనాధం నవ్వుకున్నాడు. రాజేంద్రతో తాను మాట్లాడుతూన్నంత సేపూ రాంబాబు మాలతివంక క్రీగంట దొంగచూపులు చూస్తూనే ఉన్నాడు. ఆ వయసులో ఉండే ఆకర్షణ అటువంటిది. ఆ ఆకర్షణే లేకపోతే జీవిత మాధుర్యం అనేదే ఉండేది కాదేమో ?

"మీరు చెప్పిన పెళ్ళి సంబధం ఎవరు ?" అన్నాడు రాంబాబు.




"నీకు తెలియదులే''

"మనవూరేనా ?"

"ఆఁ"

"ఎవరు ?''

''ఇంటికిపద, చెబుతాను.''

రామనాథం కొడుకు ప్రశ్నలకి తనలో తానే నవ్వుకున్నాడు. వాడి అభిప్రాయం ఏవిటో తెలియదు. కాని అంత అంద మైన పిల్లని కోడలుగా చేసుకోగలవాళ్ళ సంగతి—లేక భార్యగా పొందగల వాడి సంగతి రాంబాబుకి సహజంగా ఉత్సుకత కలిగించింది. కాని తను చెప్పబోయే సంగతి అతనికి తెలిస్తే పరిస్థితి ఎలా ఉంటుంది ? అందుకే భోజనా లైందాకా వాయిదా వేశాడు.

భోజనాలై గదిలో యిద్దరూ కూచు న్నాక "నే నొకటి అడుకుతాను చెబుతావా రాంబాబూ ?" అన్నాడు రామనాథం.

"అడగండి" అన్నాడు రాంబాబు.

"మాలతిని చేసుకోవటం నీ కిష్టమేనా ?"

రాంబాబు తెల్లబోయాడు.

"నీకు యిష్టమౌతుందనే పొద్దున రాజేంద్రతో అంత ధాటీగా చెప్పాను. రాజేంద్ర నాకు చిన్ననాటి మిత్రుడు. దేవుడిలాంటివాడు. అందుకనే అతనికి అందరూ అన్యాయం తలపెట్టారు. అతనికి అది కానుకునే శక్తి ఆనాడూ లేక పోయింది — ఈనాడూ లేకపోయింది. నేను నా జీవితంలో చాలా మందిని చూశాను రాంబాబూ ! అంత గొప్ప హృదయం కలవాడ్ని చూడలేదు. అతను నోటితో చెప్పినదానికీ, అతని మనసులో ఉండేదానికీ తేడా ఉండదు. వాడి కూతుర్ని నా కోడలుగా చేసుకోవటం నా అదృష్టమే అనుకుంటున్నాను.''

రాంబాబు జవాబు చెప్పలేదు.

"ఏమంటావు ?"

రాంబాబు తటపటాయించి "మరి.." అన్నాడు.

"చెప్పు,"

"సుబ్బులు, అమ్మ వొప్పుకోవాలి గదా ?"

"పెళ్ళి చేసుకునేది నువ్వా, వాళ్ళా?"

"ఔననుకోండి, కాని రేపొద్దున నేను వాళ్ళ యింటికి వెళ్ళాలి. వాళ్ళు నా యింటికి రావాలి.''

"దాని కేం ?"

"సుబ్బులు మావగారు ఎంత శ్రోత్రీయుడో చూస్తున్నారుగా ?"

రామనాథం వొక్క నిముషం ఊరుకుని "అవి సర్దుబాటైతే చేసుకుంటావా?" అన్నాడు.

"ఎలా ఔతాయి ?"

"అంటే నీకూ యిష్టంలేదన్నమాట?"

రాంబాబు గొంతు సవరించుకుని "నేను..." అన్నాడు.

"నేనే పొరపాటుపడ్డాను.''

"మీరలా అంటే నేను చెప్పేదేం లేదు.కాని వొక్క సంగతి ఆలోచించండి. మీరు అంత ప్రేమగా పొగిడిన మీ మిత్రుడి యిల్లాలు మీతో ఎలా మాట్లాడింది ? రేపొద్దున మీ కొడుకుకోసం పిల్లనడిగినా అలాగే మాట్లాడదని గారంటీ ఏంవుంది ?... మీరూ ఆవేశం కొద్దీ అంటున్నారుగానీ...''

రామనాథం నివ్వెరపోయాడు. ఎవరో దిమ్మదిరిగేటట్టుగా కొట్టినట్టనిపించిందాయనకి. కొడుకు మాటలకి అర్థం ఏవిటో తనకి తెలియకపోలేదు. చరిత్ర పునరావృత్తం ఔతుందంటారు ? అలాగే మన స్తత్వాలుకూడా పునరావృత్తం ఔతుంటాయా? కొడుకు చెబుతున్నది...

రామనాథం ఆశ్చర్యంనించి కోలుకున్నాడు. పొరపాట్లు చెయ్యనివాడు మనిషి కాడన్నసంగతి ఎట్లా వున్నా ముఖ్యమైన పరిస్థితుల్లోనే మనిషి పొరపాట్లు చేస్తాడన్నమాట ! అది మరొకరు చెప్పినా అర్థం చేసుకోడన్నమాట. ప్రతి మనిషీ తప్పు చేస్తాడు.

కాని రాంబాబు మనసు మారుతుందనే అనుకున్నాడు రామనాథం.

రామనాథం యింకా ఆశిస్తూనే ఉన్నాడు.

---

*1. చరణదాసి*

*2. లక్ష్మమ్మ*